సాక్షి మహబూబాబాద్

సోమవారం | 26 | ఫిబ్రవరి | 2024



వరి.. వర్రీ

రబీ వరి సాగులో రైతులకు ఆదిలోనే దిగులు మొదలైంది. నెల గడవకముందే పంట మొత్తం ఎర్రబడి చనిపోతోంది. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. - 8లో▸



తప్పుడు కేసులు, థర్డ్ డిగ్రీ

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు నమోదు చేస్తోందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
36.3^0 / 22.5^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



మహబూబాబాద్ అర్బన్: నల్లగొండ జిల్లాలో మార్చి 2నుంచి 4వరకు జరగనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మానుకోట సీనియర్స్ పురుషుల జట్టును ఎంపిక చేసినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మద్దివెంకట్ రెడ్డి, కార్యదర్శి తోట సురేష్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం సీనియర్స్ పురుషుల కబడ్డీ జట్టును ఎంపికచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా కబడ్డీ క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి మానుకోటకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. అసోసియేషన్ నియమ నింబంధనలు పాటించని కబడ్డీ క్రీడాకారులపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు సంద వీరన్న, ఉపాధ్యక్షులు గందసిరి శ్రీనివాస్, ఈసం స్వామి, సహాయ కార్యదర్శి చాంప్లనాయక్, కోశాధికారి జలగం నరేందర్, సభ్యులు నిమ్మలగంటి కృష్ణమూర్తి, అనిల్, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవచేసే అవకాశం కల్పించాలి



మహబూబాబాద్ రూరల్: కాంగ్రెస్ పార్టీనుంచి మానుకోట ఎంపీ టికెట్ ఆశిస్తున్నానని టీపీసీసీ ఎస్టీ సెల్ రాష్ట్ర చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బెల్లయ్య నాయక్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు పనిచేశానని, భవిష్యత్‌లోకూడా అదేవిధంగా పనిచేస్తానని తెలిపారు. 25 సంవత్సరాలుగా ప్రజా జీవితంలో ఉన్నానని, ప్రజలు తనను ఎంపీ కావాలని కోరుకుంటున్నారని అన్నారు. కచ్చితంగా తనను పార్టీ గుర్తించి ఎంపీ టికెట్ ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తన అభ్యర్థిత్వాన్ని బలపరచాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని, సర్వేల్లో తన పేరును బలపర్చాలని కోరారు. సమావేశంలో ఎస్టీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ గుగులోత్ వెంకట్ నాయక్, ఎస్టీ సెల్ జిల్లా చైర్మన్ బోడ రవినాయక్, జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు, ముల్లంగి ప్రతాపరెడ్డి, ఆరెందుల వెంకటేశ్వర్లు, కొత్త యుగంధర్, నరేష్ నాయక్, జక్కుల లింగన్న తదితరులు పాల్గొన్నారు.

మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలిగా నాగమణి




గార్ల: బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలిగా గార్ల మండలం సీతంపేట ఎంపీటీసీ నాగమణిని నియమిస్తూ ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వరరావు ఆదివారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

కురవి ఆలయ చైర్మన్‌గా కొర్ను రవీందర్‌రెడ్డి?

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ చైర్మన్‌గా మండలంలోని నేరడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొర్ను రవీందర్‌రెడ్డి పేరు ఖరారైనట్లు సమాచారం. మహాశివరాత్రి నుంచి వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవ జాతర జరగనున్న నేపథ్యంలో ఆలయ పాలక మండలిని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్ ఎంపిక చేసి సిద్ధం చేసినట్లు ఆదివారం విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. వారం పది రోజుల్లో కమిటీని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

దడువాయి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా సురేందర్ రెడ్డి



మహబూబాబాద్ రూరల్ : దడువాయి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు చెందిన సరసాని సురేందర్ రెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో అడహక్ కమిటీ ఆధ్వర్యంలో సంఘం ఉమ్మడి జిల్లాల కమిటీలు, రాష్ట్రంలోని మార్కెట్ల అధ్యక్షులు, కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సురేందర్ రెడ్డి ఎన్నిక జరిగింది. అనంతరం రాష్ట్ర మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాంను కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేసి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

సబ్సిడీ సిలిండర్‌పై ఆశలు

- ఒకట్రెండు రోజుల్లో పథకం అమలు
- తెల్లరేషన్ కార్డుతో లబ్ధిదారుల లింకు..
- డబ్బులు వేయడం కాదు.. సిలిండరే తక్కువకు ఇవ్వాలని డిమాండ్
- పథకం అమలు, విధివిధానాలపై జిల్లాలో తీవ్ర చర్చ



జిల్లాలో ఏజెన్సీల వారీగా గ్యాస్ కనెక్షన్ల వివరాలు			
కంపెనీ	హెచ్‌పీ	భారత్	ఇండేన్
కనెక్షన్లు	90,790	66,347	55,062

సాక్షి, మహబూబాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోంది. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించగా.. తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతీ కుటుంబానికి రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందజేసే ప్రక్రియ ను ఒకటి రెండు రోజుల్లో ప్రారంభించనున్నట్లు మంత్రులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా పథకం అమలు, విధివిధానాలపై జిల్లాలో తీవ్ర చర్చ సాగుతోంది.

కనెక్షన్లు ఇలా..

గృహజ్యోతి పథకంలో భాగమైన రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 2,40,370 కుటుంబాలకు తెల్లరేషన్ కార్డులు ఉన్నాయి. ఈ కార్డులు ఉన్నవారికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. అయితే జిల్లాలో 13 ఏజెన్సీల ద్వారా 87వేల మేరకు సింగిల్ సిలిండర్లు, 40వేల మేరకు డబుల్ సిలిండర్లు, 1500 మేరకు కమర్షియల్ సిలిండర్లు, ఉజ్వల, దీపం పథకం కనెక్షన్లు 83వేలకు పైగా ఉన్నాయి. అయితే గ్యాస్ కనెక్షన్లు ఉన్నవారిలో ప్రభుత్వ ఉద్యోగులు, బడా వ్యాపారవేత్తలను మినహాయింపు చేశారు. అదేవిధంగా ఒకే ఇంట్లో రెండు, మూడు కనెక్షన్లు ఉన్నవారు కూడా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. కాగా రేషన్ కార్డులో పేరు నమోదైన వారు ప్రస్తుతం వేరుపడి కనెక్షన్లు తీసుకున్నప్పటికీ.. కార్డులో ఒక కనెక్షన్‌కే పథకం వరిస్తుందని తెలిసింది. దీంతో జిల్లాలో 1.29లక్షల కనెక్షన్లకు పథకం వర్తించే అవకాశం లేదని సమాచారం.

రేషన్ కార్డు లేకుంటే..

ప్రభుత్వం అమలు చేసే ఆరు గ్యారంటీ పథకాలకు తెల్లరేషన్ కార్డు లింకు పెట్టడంతో రేషన్ కార్డులు లేని వారు పథకం పొందలేక పోతున్నారు. కొన్నేళ్లుగా ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదు. అంతకు ముందు ఇచ్చినవి కూడా మొక్కుబడిగానే ఇచ్చారు. దీంతో జిల్లాలోని రేషన్ కార్డు కావాలని ఇప్పటి దరఖాస్తు చేసుకున్న వారు 47వేలకు పైగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వీరందరు ముందుగా రేషన్ కార్డు తీసుకుంటేనే గ్యాస్, విద్యుత్ సబ్సిడీ వర్తిస్తాయి. కాగా ఒకటి రెండు రోజుల్లో పథకం అమలు అవుతుందని నాయకులు, అధికారులు చెప్పడంతో నిరుపేదలమైనప్పటికీ.. రేషన్ కార్డు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు పొందలేక పోతున్నామని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

తక్కువ ధరకే అందించాలి



ప్రభుత్వం నేరుగా లబ్ధిదారులకు రూ. 500లకే గ్యాస్ సిలిండర్ అందజేయాలి. మొత్తం డబ్బులు కట్టిన తర్వాత సబ్సిడీ ఇస్తామని చెబితే ఎలా. సబ్సిడీ కోసం మాటిమాటికీ ఖాతాలో చూడడం ఇబ్బంది అవుతుంది. రూ.500 చెల్లిస్తే గ్యాస్ సిలిండర్ అందజేయాలి.

- భూక్య కవిత, చంద్యాతండా జీపీ, కురవి

రేషన్ కార్డులు త్వరగా ఇవ్వాలి



మేం బతుకుదెరువు కోసం సూరత్ వెళ్లాం. అప్పుడు రేషన్ కార్డులు మాకు ఇవ్వలేదు. మా సొంత ఊరుకు వచ్చి ఐదు సంవత్సరాలు దాటింది. ఇక్కడే ఉంటున్నాం. రేషన్ కార్డు లేదని ప్రభుత్వ పథకాలు రావని అంటున్నారు. రేషన్ కార్డు ఇచ్చి ప్రభుత్వ పథకాలు వచ్చేలా చూడాలి.

-కోట పద్మ, నర్సింహులపేట

పేదలందరికీ పథకాలు అందించాలి



ప్రభుత్వం ఎన్నికల ముందు చెప్పిన విధంగా ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేయాలి. రేషన్ కార్డులకు లింకులు పెట్టి నిరుపేదలకు పథకాలు రాకుండా చేయవద్దు. అధికారులు కుటుంబాల ఆర్థిక పరిస్థితిని తెలుసుకొని అర్హులందరికీ పథకాలు అమలు చేయాలి.

-సామ రజిత, మహబూబాబాద్

మోటివేషన్ క్లాసులు

- పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- సైకాలజిస్టు, ఎడ్యుకేషనిస్టులతో తరగతులు
- భయం లేకుండా పరీక్షలు రాసేలా చర్యలు
- కలెక్టర్ ఆదేశాలతో నూతన ఆలోచన



క్లాసులు నిర్వహిస్తున్న సైకియాట్రిస్ట్ రాధిక(ఫైల్)

సాక్షి, మహబూబాబాద్: పదో తరగతి విద్యార్థుల్లో పరీక్షల భయం పోగొట్టేందుకు విద్యాశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. కొంతమంది విద్యార్థులు బాగా చదివినప్పటికీ.. భయంతో పరీక్షలు బాగా రాయలేరు. ఇలాంటి వారితో పాటు చదువులో వెనుకబడిన వారు సైతం పాస్ మార్కులు సాధించేలా సైకాలజిస్టులు, ఎడ్యుకేషనిస్టులతో మోటివేషన్ తరగతులు నిర్వహిస్తున్నారు. కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ చేసిన ఈ నూతన ఆలోచనతో టెన్త్ విద్యార్థులను పరీక్షలకు సంసిద్ధం చేస్తున్నారు.

భయం పోగొట్టేలా..

అప్పటి వరకు తమ పాఠశాలల్లోనే పరీక్షలు రాసిన పదో తరగతి విద్యార్థులు ఇతర స్కూళ్ల వెళ్లి రాయాల్సి ఉంటుంది. ఈక్రమంలో వారు ఆందోళన చెందుతారు. కొత్త వాతావరణం, ఇన్విజిలేటర్లు, పోలీసు బందోబస్తు, స్క్వాడ్ ఇలా పలు రకాలుగా విద్యార్థులు భయాందోళనతో పరీక్షలు బాగా రాయలేకపోతారు. కాగా ఇలాంటి భయాల్ని తొలగించేందుకు మోటివేషన్ క్లాసులు నిర్వహిస్తున్నారు.

84 పాఠశాలల ఎంపిక..

జిల్లా వ్యాప్తంగా 8,199 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవుతారు. ఇందులో వెనుకబడిన ప్రాంతాల్లోని 84ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేశారు. 3,860 మంది విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహిస్తున్నారు. వైద్యారోగ్యశాఖ నుంచి మానసిక నిపుణులు, విద్యాశాఖ నుంచిసీనియర్ ఉపాధ్యాయులు లేదా సెక్టోరియల్ అధికారి ద్వారా క్లాసులు చేపడుతున్నారు. మార్చి 18వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో.. పరీక్షలకు వారం రోజుల ముందుగానే మోటివేషన్ తరగతులు పూర్తి చేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రధానంగా భయాన్ని పోగొట్టడం, తెలిసిన విషయాన్ని నిర్భయంగా రాయడం, పరీక్షలు అంటే ఆందోళన చెందకుండా ఉండేలా విద్యార్థులను మోటివేట్ చేస్తున్నారు.

మంచి ఫలితాలు వస్తాయి



ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు నిర్వహించడం సంతోషకరం. విద్యార్థులను మానసికంగా సిద్ధం చేసేందుకు తరగతులు దోహదపడుతాయి. దీంతో మెరుగైన ఫలితాలు కూడా వచ్చే అవకాశం ఉంది. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఎక్కువగా ఉపయోగపడుతాయి.

-సంక భద్రినారాయణ, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు

స్వేచ్ఛగా పరీక్షలు రాయాలి



పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించాలంటే విద్యార్థులు స్వేచ్ఛాయుత వాతావరణంలో పరీక్షలు రాయాలి. ఇందుకోసం వారిలోని భయాన్ని పోగొట్టడం, తెలిసిన విషయాలను నిర్భయంగా రాసేలా సంసిద్ధులను చేయడమే కార్యక్రమం ఉద్దేశం. కలెక్టర్, డీఈఓ ఆదేశాల మేరు మోటివేషన్ క్లాసులు నిర్వహిస్తున్నాం.

-మైదం చంద్రశేఖర్ ఆజాద్, ఏఎంఓ

క్లాసులు ఉపయోగపడుతాయి..



గిరిజన విద్యార్థులు ఎక్కువగా ఉండే జిల్లా మానుకోట. తండాలు, మారుమూల ప్రాంతాల్లో పదో తరగతి వరకు చదువుకుంటారు. పరీక్షలు రాసేందుకు పట్టణాలు, మండల కేంద్రాల్లోని పాఠశాలలకు రావాల్సి ఉంటుంది. ఈ మార్పుతో విద్యార్థులు ఇబ్బంది పడే అవకాశం ఉంది. ఈ క్లాసులు విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటాయి.

-గుగులోత్ కిషన్ నాయక్, ఉపాధ్యాయుడు

కనుల పండువగా బొడ్రాయి వార్షికోత్సవం



బైండ్ల కులస్తులకు వస్త్రాలు బహూకరిస్తున్న ఎంపీ ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్



ముత్యాలమ్మ తల్లి దేవాలయం వద్ద మొక్కులు చెల్లించేందుకు క్యూలో నిలబడిన భక్తులు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ పట్టణంలో కొలువుదీరిన గ్రామ దేవత బొడ్రాయి మొదటి వార్షికోత్సవం కనులపండువగా నిర్వహించారు. ఆదివారం ఉదయకాల పూజతో అర్చకులు తాటిపాముల నరసింహమూర్తి, గుడి రాధాకృష్ణమూర్తి, రంగావఝుల సుధాకరశాస్త్రి, దుర్గాప్రసాద్, కౌశిక్‌శర్మ వేద మంత్రాలతో గణపతి, దుర్గాదేవి, రుద్ర యజ్ఞాలు జరిపి పూర్ణాహుతి నిర్వహించారు. కుంభాభిషేకం, మహాదాశీర్వచనం చేశారు. భక్తులు పంచ బోనాల సమర్పించగా.. సంప్రదాయం ప్రకారం బైండ్ల, శాలివాహన, రజక, విశ్వబ్రాహ్మణ కుల సంఘాల బాధ్యులు శీతలమాత పట్నం పూజలు, జంతుబలి పూజలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, ఉమా దంపతులు, మున్సిపల్ చైర్మన్, కమిటీ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి, డాక్టర్ సౌజన్య దంపతులు పాల్గొని పూజలు ఆచరించారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, డాక్టర్ సీతామహాలక్ష్మి దంపతులు బొడ్రాయి తల్లిని దర్శించుకుని పూజలు చేశారు. కాగా బొడ్రాయి వద్దకురాలేని భక్తులు సమీపంలోని ముత్యాలమ్మ, ఇతర గ్రామ దేవతల వద్ద బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. డీఎస్పీ తిరుమలరావు పర్యవేక్షణలో టౌన్, రూరల్ సీఐలు దేవేందర్, సర్వయ్య ఆధ్వర్యంలో ఎస్సైలు రామారావు, దీపికరెడ్డి, గోపి, అరుణ, శివ, పోలీసు సిబ్బంది బందోబస్తు విధులు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పర్కాల శ్రీనివాస్ రెడ్డి, ఘనపురపు అంజయ్య, సుభాషిణి, మాలె నాగేశ్వర్‌రావు, ఎడ్ల వేణుమాధవ్, ఎడ్ల రమేష్, పిల్లి సుధాకర్, ఆకుల హరిప్రసాద్, బొడ్డుపెల్లి ఉపేంద్రం, బెల్లంకొండ శ్రీనివాస్, జంగాల సదాశివుడు, చుక్కల ఉదయచందర్, పోతురాజు రాజు, భూక్య శ్రీను, అనుమాల వెంకటేశ్వర్లు, కర్పూరపు గోపి, ఆకుల నవీన్, తునగర్ ఈశ్వర్, గోనె శ్యాంరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన మొక్కులు

- తల్లులు వనానికి తరలినా తగ్గని భక్తుల రద్దీ
- జనసంద్రంగా మేడారం గద్దెల ప్రాంగణం
- ఈనెల 28న హుండీల్లోని కానుకల లెక్కింపు



ఆదివారం మధ్యాహ్నం మేడారం గద్దెల ప్రాంగణంలో భక్తుల రద్దీ

ఎస్ఎస్‌తాడ్వాయి/గోవిందరావుపేట: మేడారం సమ్మక్క–సారలమ్మ మహాజాతర ముగిసినా అమ్మవార్ల దర్శనానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. శనివారం వనదేవతలు వనప్రవేశం చేసిన తర్వాత కూడా భక్తుల రాక కొనసాగింది. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవార్ల గద్దెల వద్దకు చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రద్దీ పెరగడంతో భక్తులను గద్దెలపైకి అనుమతించలేదు. క్యూలైన్‌ల ద్వారా దర్శించుకున్నారు. వాహనాలను మేడారం ఐలాండ్ వరకు అనుమతించడంతో రోడ్ల వెంట వాహనాలు బారులుదీరాయి. కాగా జాతర ముగిసినా ఆర్టీసీ ద్వారా మేడారానికి భక్తులు తరలివచ్చారు.

గద్దెల ప్రాంగణంలో మిశ్రమం తొలగింపు

జాతర జరిగిన నాలుగు రోజులు లక్షలాది మంది భక్తులు కొబ్బరి, బెల్లం, ఒడిబియ్యం, పసుపు, కుంకుమలను మొక్కుగా సమర్పించడంతో మేడారం వనదేవతల గద్దెలపై పేరుకుపోయాయి. ప్రాంగణంలో పేరుకుపోయిన మిశ్రమాన్ని డీపీఓ వెంకయ్య పర్యవేక్షణలో పారిశుద్ధ్య కార్మికులు తొలగించి ట్రాక్టర్‌లో తరలిస్తున్నారు. ఈగలు, దోమలు వ్యాపించకుండా మందు స్ప్రే చేస్తున్నారు.

భక్తులకు మంత్రి సీతక్క సూచనలు

జాతర ముగిసినా మంత్రి సీతక్క ఆదివారం మేడారానికి వచ్చారు. భారీగా భక్తులు తరలిరావడంతో



వ్యర్థాలను తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

గద్దెల ప్రాంగణంలో రద్దీని మీడియా మంచెపై నుంచి ఆమె పర్యవేక్షించారు. ప్రశాంతంగా అమ్మవార్లను దర్శించుకోవాలని, భక్తులకు బెల్లం ప్రసాదం పంపిణీ చేయాలని వలంటీర్లకు మైక్ ద్వారా సూచించారు. జాతర విజయవంతానికి కృషి చేసిన అధికారులను దేవాదాయశాఖ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి సన్మానించారు.

ఈనెల 28న హుండీల లెక్కింపు

వనదేవతలకు భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను ఈనెల 28న హన్మకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో లెక్కించనున్నట్లు ఈఓ రాజేంద్రం తెలిపారు. మొత్తం 520 హుండీలను సోమవారం ప్రత్యేక వాహనంలో పోలీసు బందోబస్తు మధ్య కల్యాణ మండపానికి తరలించనున్నారు. ఈనెల 28(బుధవారం) అమ్మవార్ల తిరుగువారం పండుగ రోజున కానుకల లెక్కింపునకు అధికారులు సిద్ధమవుతున్నారు.

పూనుగొండ్లకు చేరిన పగిడిద్దరాజు

గంగారం: మేడారం నుంచి శనివారం రాత్రి బయల్దేరిన పగిడిద్దరాజు ఆదివారం సాయంత్రం పూనుగొండ్ల గ్రామానికి చేరుకున్నారు. జాతర ముగించుకుని తిరిగి వచ్చిన పగిడిద్దరాజుకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. బుధ, గురు, శుక్రవారం తిరుగువారం జాతర నిర్వహించనున్నట్లు ఈసందర్భంగా పూజారులు తెలిపారు.

నష్టపరిహారం చెల్లించాలి

- నకిలీ వరి విత్తనాలు ఇచ్చారని రైతుల ఆరోపణ



నకిలీ విత్తనాలు ఇచ్చారని మాట్లాడుతున్న రైతులు

మహబూబాబాద్ రూరల్ : నకిలీ వరి విత్తనాలతో సాగుచేసి నష్టపోయిన గిరిజన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని రాందాస్, సరోజ, సక్రాం అన్నారు. నకిలీ విత్తనాలను విక్రయించిన షాపు యజమానిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రైతులు ఆదివారం నిరసన తెలిపారు. జిల్లా కేంద్రం శివారు బాబునాయక్ తండాలో రైతులు మాట్లాడుతూ.. 10 మంది గిరిజన రైతులు మహబూబాబాద్ పట్టణంలోని శ్రీబాలాజీ అగ్రిమాల్ షాపులో ఆర్ఎన్ఆర్ వరి విత్తనాలను కొనుగోలు చేసి 30 ఎకరాల్లో సాగు చేశామన్నారు. సాగు చేసిన 50రోజులకే పంట కంకులు వేసిందని, 120 రోజులకు కంకులు రావాల్సి ఉండగా ముందుగానే పంట ఈనిందని తెలిపారు. దీంతో నష్టపోయామని, ఎకరానికి రూ.30 వేల చొప్పున పెట్టుబడి పెట్టామని ఆవేదన వ్యక్తం చేశారు. పరిహారం ఇప్పించాలని బాధిత రైతులు విజ్ఞప్తి చేశారు.

ప్రజాసంకల్పయాత్రను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

కేసముద్రం: మానుకోట పట్టణంలో ఈనెల 28న బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టే బహిరంగసభ, ప్రజాసంకల్పయాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మానుకోటలో బహిరంగ సభ తర్వాత కేసముద్రం మీదుగా గూడూరు మండల కేంద్రానికి ప్రజాసంకల్పయాత్ర బయలుదేరుతుందన్నారు. ప్రతిగ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు, బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లు హాజరై యాత్రను విజయవంతం చేయాలన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, కేసముద్రం మార్కెట్ మాజీ చైర్మన్ శివవర్ధన్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గాంతి వెంకట్‌రెడ్డి, లంకలపల్లి శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, మల్యాల రాములు, ప్రభాకర్‌రెడ్డి, రమేష్, యుగేందర్, నాగయ్య, శివ, సుధాకర్, రమేష్, వెంకన్న, లూనావత్ వెంకన్న పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతిని కాపాడే బాధ్యత మనదే..

హన్మకొండ కల్చరల్ : భారతీయ మహిళలు విదేశీ సంస్కృతుల ప్రభావానికి లోనుకావద్దు.. వేదకాలం నుంచి నేటి వరకు విలసిల్లుతున్న భారతీయ సంస్కృతిని కాపాడే బాధ్యత మనదేనని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, వ్యక్తిత్వ వికాస బోధకురాలు భారతీయం సత్యవాణి అన్నారు. ఆదివారం వరంగల్ భద్రకాళి దేవాలయం సమీప కీర్తి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన మహిళా శక్తి సమ్మేళనం కనులపండువగా నిర్వహించారు. ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ ఇందిర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని సత్యవాణితోపాటు కమ్యూనిటీ మొబిలైజేషన్, ఇంక్లూసివ్ ఎడ్యుకేషన్ డిస్ట్రిక్ కోఆర్డినేటర్ బోయినపల్లి రాధ, వీహెచ్‌పీ రాష్ట్ర కార్యవాహిక ఎస్.వరలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యవాణి మాట్లాడుతూ.. ఇక్కడ స్త్రీలకు అన్ని అవకాశాలున్నా హక్కుల కోసం పోరాడే స్థితి లేదన్నారు. రాధ మాట్లాడుతూ మహిళలు సాధికార దిశగా పయనిస్తున్నారని చెప్పారు. అనంతరం జరిగిన రెండవ సమావేశంలో కేయూ ప్రొఫెసర్ మారోజు స్వర్ణలత, ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ లక్ష్మీరమ, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సూర్యకళ, ప్రజ్ఞాభారతి వేదసంహిత, అడ్వకేట్ సముద్రాల కవిత తదితరులు మహిళాశక్తిపై ప్రసంగించారు. చిన్నారుల శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు అలరించాయి.

అంధత్వ నివారణే లక్ష్యం

- 'విటమిన్ ఏ' ద్రావణం పంపిణీ పూర్తి
- 49,486 మంది చిన్నారులకు అందజేత



చిన్నారికి విటమిన్ ఏ ద్రావణాన్ని తాగిస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

నెహ్రూసెంటర్: చిన్నారుల్లో అంధత్వ నివారణే లక్ష్యంగా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో 'విటమిన్ ఏ' ద్రావణం పంపిణీ చేశారు. తొమ్మిది నెలల నుంచి ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు ద్రావణాన్ని అందించారు. వైద్యుల పర్యవేక్షణలో చిన్నారులకు అందించగా, దీని ద్వారా కంటి సంబంధిత వ్యాధులు, రేచీకటి, కంట్లో మచ్చలు వంటి సమస్యలు తొలగనున్నాయి.

జిల్లాలో...

జిల్లాలో 9నెలల నుంచి ఐదు సంవత్సరాలలోపు పిల్లలు 4,9486 మంది ఉండగా.. వారందరికీ విటమిన్ ఏ ద్రావణాన్ని పంపిణీ చేశారు. అంగన్‌వాడీ సెంటర్‌లో వ్యాధి నిరోధక టీకాలతో పాటు విటమిన్ ఏ ద్రావణం పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేశారు. కాగా 9నెలల నుంచి 12 నెలల వయసు గల పిల్లలకు 1.మి.లీ, సంవత్సరం నుంచి 5 సంవత్సరాల వయసు గల పిల్లలకు 2 మి.లీ విటమిన్ ఏ ద్రావణాన్ని అందజేశారు.

కంటి సమస్యలు రాకుండా..

9నెలల నుంచి ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ విటమిన్ ఏ ద్రావణాన్ని అందించడం ద్వారా కంటి సమస్యలు రాకుండా ఉంటుంది. చిన్నారుల్లో అంధత్వ నివారణే లక్ష్యంగా ప్రభుత్వం, వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టాం. ఈ నెల 13 నుంచి 19వ తేదీ వరకు పంపిణీ చేశాం.

- డాక్టర్ విజయ్‌కుమార్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి

ప్రెస్‌ అకాడమీ చైర్మన్‌ నియామకంపై హర్షం

నయీంనగర్‌: తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా ఐజేయూ జాతీయ అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌ రెడ్డిని నియమించడంపై టీయూడబ్ల్యూజే హనుమకొండ జిల్లా కమిటీ ఆదివారం హర్షం వ్యక్తం చేసింది. టీయూడబ్ల్యూజే హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్‌, రాష్ట్ర కార్యదర్శి గాడిపెల్లి మధు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటరమణ, గుంటి విద్యాసాగర్‌, గ్రేటర్‌ వరంగల్‌ ప్రెస్‌ క్లబ్‌ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, మాజీ అధ్యక్షులు గడ్డం కేశవమూర్తి, పిన్నా శివకుమార్‌, పీవీ. మధన్‌మోహన్‌ తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీడియా అకాడమీ చైర్మన్‌గా శ్రీనివాస్‌ రెడ్డి నియమించడంపై సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సీనియర్‌ జర్నలిస్టు శ్రీనివాస్‌రెడ్డి నాయకత్వంలో జర్నలిస్టులకు మేలు జరుగుతందని తెలిపారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, హెల్త్‌ కార్డుల సమస్యలకు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా, ఇటీవల మేడారం పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి జర్నలిస్టుల సమస్యలు త్వరగా పరిష్కరిస్తామని తెలుపగా కృతజ్ఞతలు తెలిపారు.

రెండు నెలల్లో నివేదిక సమర్పించాలి

- ఎస్టీయూ టీఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. పర్వత రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పర్వతరెడ్డి

విద్యారణ్యపురి: ఉపాధ్యాయ, ఉద్యోగులకు శాపంగా మారిన 317 జీఓపై నియమించిన ముగ్గురు మంత్రులతో కూడిన సబ్‌ కమిటీ నివేదికను రెండు నెలల్లో ప్రభుత్వానికి నివేదించాలని స్టేట్‌ టీచర్స్‌ యూనియన్‌ తెలంగాణ రాష్ట్రం (ఎస్టీయూటీఎస్‌) రాష్ట్ర అధ్యక్షుడు పర్వత రెడ్డి డిమాండ్‌ చేశారు. ఆదివారం హనుమకొండలోని ఎస్టీయూ భవనంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. 317జీఓతో ఎంతోమంది ఉపాధ్యాయులు నష్టపోయారని, వారి సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం సబ్‌కమిటీని నియమించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఎస్టీయూ టీఎస్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందం గౌడ్‌ మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల కంటే ముందే ఉపాధ్యాయులకు పెండింగ్‌ డీఏ మంజూరు చేయాలన్నారు. ఎస్టీయూ టీఎస్‌ ఆర్థిక కార్యదర్శి సదయ్య, సంఘం మాసపత్రిక సంపాదకుడు ప్రసాద్‌, రాష్ట్ర అసోసియేట్‌ అధ్యక్షుడు రవి, గజేందర్‌, రంగారావు, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శులు సుధాకర్‌, మీర్‌అహ్మద్‌అలీ, తదితరులు పాల్గొన్నారు.

వరి.. వర్రీ

నెల గడవకముందే చనిపోతున్న నాట్లు

- పంటను ఆశిస్తున్న చీడపీడలు.. తెగుళ్లు
- ఆందోళనలో అన్నదాతలు



వరిలో తెల్లకంకులు


జింక్‌ లోపంతో ఇటుక రంగులోకి మారిన పంట


నేలలో అధిక సల్ఫైడ్‌ (గంధకం) వల్ల కుళ్లిన వరి పాదుల వేర్లు

దుగ్గొండి: రబీలో రైతులు కోటి ఆశలతో వరి సాగు చేపట్టారు. గత వర్షాకాలం సన్న రకం ధాన్యానికి అధిక ధర పలకడంతో యాసంగిలో రైతులు ఉత్సాహంతో సన్న రకాలు సాగు చేశారు. అయితే ఆదిలోనే అన్నదాతలకు దిగులు మొదలైంది. నాటు వేసి నెల గడవకముందే పంట మొత్తం ఎర్రబడి చనిపోతోంది. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఈ సారి యాసంగి జిల్లా వ్యాప్తంగా 58,600 ఎకరాల్లో వరిపంట సాగు చేశారు. దాదాపు వరినాట్లు పూర్తయ్యాయి. కొన్ని చోట్ల పంట 15 నుంచి 60 రోజుల వయసులో ఉంది. నాటు వేసిన 15వ రోజు నుంచే మొగిపురుగు, అగ్గితెగులు, వేరు కుళ్లు తెగుళ్లు ఆశించి పంట మొత్తం చనిపోతోంది. ఈ నేపథ్యంలో వరి పంటలో తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను జిల్లా వ్యవసాయ అధికారి ఉషాదయాళ్‌.. రైతులకు వివరించారు.

కాండం తొలుచుపురుగు..

నారుమడిలో ఈ పురుగు ఆశిస్తే మొక్కలు, పిలకదశలో ఆశిస్తే మొవ్వులు చనిపోతాయి. అంకురం నుంచి చిరుపొట్ట దశలో ఆశిస్తే తెల్లకంకులు అవుతాయి. ఆలస్యంగా లేదా ముదురు నారు నాటడం, నీటి తడులు సరిగా అందకపోవడం, రాత్రి ఉష్ణోగ్రతలు చాలా తక్కువగా ఉండడం, సూర్యరశ్మి అందకపోవడం నత్రజని తక్కువగా వాడడం వల్ల కాండం బలహీనంగా ఉండి పురుగు ఆశించడానికి అనుకూలంగా ఉంటుంది.

నివారణ..

పురుగు ఉధృతిని గుర్తించడానికి ఎకరాకు 8 లింగార్షక బుట్టలు ఏర్పాటు చేయాలి. పిలకలు, లేదా దుబ్బు దశలో ఎకరాకు 10 కిలోల 3జీ గుళికలు వేయాలి. చిరుపొట్ట దశలో క్లోరంట్రానిలిప్రోల్‌ మందును లీటర్‌ నీటికి 0. 3 మిల్లీలీటర్లు కలిపి పిచికారీ చేయాలి..


జిల్లా వ్యవసాయ అధికారి ఉషాదయాళ్‌

అగ్గి తెగులు..

వరిపైరు ఆకులపై నూలు కండె ఆకారంలో మచ్చలు ఏర్పడి క్రమేణా పెద్దగామారి ఒకదానికొకటి కలిసిపోయి ఆకులు పాక్షికంగా లేదా పూర్తిగా ఎండిపోతాయి. క్రమేణా మొక్కల ఆకులు ఎండిపోయి దూరం నుంచి చూస్తే తగలబడినట్లు కనబడుతుంది.

నివారణ..

అగ్గితెగులు సోకిన పంటలో యూరియా వినియోగం తగ్గించి పలు దఫాలుగా వాడాలి. చిరుపొట్ట దశ దాటిన తర్వాత ఎరువులను వాడొద్దు. లీటర్‌ నీటికి 0.6 మిల్లీగ్రాముల ట్రైసైక్లజోల్‌ మందును కలిపి పైరుపై పిచికారీ చేయాలి.

జింక్‌ లోపం..

వరిలో జింకుదాతు లోపం వల్ల మొక్కల్లో పైనుంచి 3 లేదా 4 ఆకుల మధ్యే ఈనే పాలిపోతుంది. ఆకులపై ఇటుక రంగు మచ్చలు ఏర్పడతాయి. నత్రజని ఎరువులు వేసినా పైరు పచ్చబడదు. నివారణకు వరి సాగు చేపట్టే భూముల్లో ప్రతి మూడు పంటలకు ఒకసారి ఎకరాకు 20 కిలోల జింక్‌ సల్ఫేట్‌ను వేయాలి. లీటర్‌ నీటికి 2 గ్రాముల జింక్‌ సల్ఫేట్‌ను కలిపి వరిపైరుపై 5 రోజుల వ్యవధిలో రెండు, మూడు సార్లు పిచికారీ చేయాలి. జింక్‌ సల్ఫేట్‌ పిచికారీ సమయంలో ఎలాంటి ఇతర మందులను కలపొద్దు.

భూమిలో సల్ఫైడ్‌ ఎక్కువ ఉంటే..

వరి పంట కొంతకాలంగా అధికంగా పెరిగి పసుపు వర్ణంలోకి మారుతుంది. దీనికి కారణం నేలలో సల్ఫైడ్‌(గంధకం) ఎక్కువ ఉండడం. నేల మెత్తగా ఉండి కాలువేసిన వెంటనే లోతుగా దిగిపోతుంది. పొలంలో నడుస్తుంటే బుడగల రూపంలో గాలి బయటకు వస్తుంది. నేల నుంచి దుర్వాసన వస్తుంది. మొక్క వేర్లను బయటకు తీస్తే కుళ్లిన కోడి గుడ్డు వాసన వస్తుంది. దీనికి కారణం నీటి ముంపు, తగిన రీతిలో పంట వేర్లకు గాలి అందకపోవడం, నేలలో ఇనుము లభ్యం కాకపోవడం, బరువు నేలల్లో గతంలో గంధకం ఉన్న 20–20–0–15 ఎరువులు అధికంగా వాడడం. సల్ఫైడ్‌ నేలలో ఎక్కువై పంట వేళ్లు కుళ్లిపోతాయి. నివారణకు వరిలో మొక్కల వేర్లకు తగినంత మేర గాలి తగిలేలా మురుగు నీటిని తీసివేయాలి. పొలాన్ని సన్నని నెర్రెలు వచ్చే వరకు ఆరబెట్టి మళ్లీ నీరు ఇవ్వాలి.

విహారం.. విషాదం

- పాకాల వాగులో యువకుడి మృతి


జాకీర్‌ (ఫైల్‌)

ఖానాపురం/కాశిబుగ్గ: విహార యాత్ర విషాదమైంది. సెలవు దినం కావడంతో సరదాగా గడపడానికి పాకాలకు వచ్చిన ముగ్గురు స్నేహితులు వాగులో దిగారు. ఈ క్రమంలో నీటి ప్రవాహానికి కొట్టుకుపోయి వాగులోనే ఉన్న గుంతలో పడ్డారు. ఈ ఘటనలో నీట మునిగి ఓ యువకుడు మృతి చెందగా ఇద్దరిని స్థానికులు రక్షించారు. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్‌ కాశిబుగ్గకు చెందిన ఎండీ. జాకీర్‌(24) ఆటోమొబైల్‌ షాపులో పని చేస్తున్నాడు. ఆదివారం సెలవుదినం కావడంతో తన స్నేహితులు కాశిబుగ్గ, చింతల్‌కు చెందిన రెహాన్‌, సహరల్‌తో కలిసి పాకాలకు వచ్చాడు. స్నానాలు చేయడానికి గిరకతాటి వనంవైపు ఉన్న వాగులో దిగారు. ఈ క్రమంలో నీటి ప్రవాహానికి కొట్టుకుపోయి వాగులోనే ఉన్న గుంతలో పడ్డారు. ముగ్గురికీ ఈత రాకపోవడంతో రెహాన్‌, సహరల్‌ చెట్టుకొమ్మలను పట్టుకుని కేకలు వేశారు. ఈ క్రమంలో అశోక్‌నగర్‌కు చెందిన రమేష్‌, జంపయ్య అటువైపు వెళ్తుండగా కేకలు వినిపించడంతో ఘటనా స్థలికి చేరుకుని యువకులను బయటకు తీశారు. జాకీర్‌ అప్పటికే వాగులో మునిగి మృతి చెందాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా ఇన్‌చార్జ్‌ ఎస్సై నగేష్‌ ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, జాకీర్‌ మృతితో కాశిబుగ్గలో విషాదం నెలకొంది.

దశదిన కర్మకు హాజరై ఎల్కుర్తిలో మరో యువకుడు..

ధర్మసాగర్‌ : కాల్వలో పడి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం మండలంలోని ఎల్కుర్తి శివారులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వరంగల్‌ ఉర్సు కరీమాబాద్‌ ప్రాంతానికి చెందిన దూడ రఘుతేజ (26) తన స్నేహితుడు మండల అరుణ్‌ కుమార్‌ తాత దశదిన కర్మ నిమిత్తం మండలంలోని నర్సింగరావుపల్లికి వచ్చాడు. ఈ క్రమంలో అరుణ్‌ కుమార్‌, రోహిత్‌, దూడ రఘుతేజ ఎల్కుర్తి సమీపంలోని కెనాల్‌ వద్దకు బహిర్భూమికి వచ్చారు. నీటి కోసం రఘుతేజ కాల్వలోకి దిగబోతుండగా జారి పడి మునిగి మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు పవన్‌ కుమార్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


రఘుతేజ (ఫైల్‌)

ఆలయ అభివృద్ధికి రూ.6 లక్షల విరాళం

కురవి: మండల కేంద్రంలోని వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధికి హైదరాబాద్‌లో నివాసమంటున్న మరిపెడ మండలంలోని వీరారం గ్రామానికి చెందిన డాక్టర్‌ కట్కూరి నరేందర్‌రెడ్డి, గీత, డాక్టర్‌ వివేక్‌రెడ్డి, ఇందిరాదేవి దంపతులు ఆదివారం అర్చకులకు రూ.6 లక్షల విరాళం చెక్కు రూపంలో అందజేశారు. అనంతరం భద్రకాళి, వీరభద్రస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ మండపంలో వేదాశీర్వచనాలు అందజేశారు. సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు ఎర్రంరెడ్డి సుధాకర్‌రెడ్డి, కట్కూరి శ్రీనివాస్‌రెడ్డి, సరిత, కట్కూరి శ్రీకాంత్‌ రెడ్డి, అనుపమ దంపతులు పాల్గొన్నారు.


అర్చకులకు చెక్కు అందజేస్తున్న భక్తులు

‘సదానందానికి మద్దతు’

- తెలంగాణ రాష్ట్ర పవర్‌ ఎంప్లాయీస్‌ జేఏసీ

హన్మకొండ: వరంగల్‌ ఎంపీగా పోటీ చేయలని భావిస్తున్న పరికి సదానందానికి తెలంగాణ రాష్ట్ర పవర్‌ ఎంప్లాయీస్‌ జేఏసీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని ఆ జేఏసీ చైర్మన్‌ సాయిబాబు, కో చైర్మన్‌ ఇనుగాల శ్రీధర్‌, కోకన్వీనర్‌ బీసీ రెడ్డి, వైస్‌ చైర్మన్‌ అనిల్‌ కుమార్‌ తెలిపారు. ఆదివారం హనుమకొండలో సంఘం జేఏసీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ విద్యుత్‌ ఉద్యోగ సంఘం నేతగా పనిచేస్తున్న సదానందంకు కాంగ్రెస్‌ పార్టీ టికెట్‌ ఇవ్వాలని కోరారు. సామ్యానాయక్‌, నార్ల సుబ్రహ్మణ్యేశ్వర్‌ రావు, మహేందర్‌ రెడ్డి, మచ్చిక బుచ్చయ్య గౌడ్‌, బేగ్‌ పాల్గొన్నారు.


సందానందానికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నేతలు

అవయవ దానానికి ముందుకు రావాలి

విద్యారణ్యపురి: అవయవదానానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని డీజీపీ ఆఫీస్‌ అడ్మినిస్ట్రేషన్‌ సూపరింటెండెంట్‌ ఆఫ్‌ పోలీస్‌ దుంగ్రోతు నాగరాజు కోరారు. ఈ మేరకు శనివారం హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళాడిగ్రీ కళాశాలలో అవయవదానంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అవయవదానం చేసి ప్రాణదాతలుగా మారాలన్నారు. తెలంగాణ నేత్ర శరీర అవయవ దాతల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరికిపండ్ల అశోక్‌ మాట్లాడుతూ అవయవ దానం చేస్తే చిరంజీవులవుతారన్నారు. దేశంలో 12లక్షల మంది అంధులు నేత్ర దాతలకోసం ఎదురుచూస్తున్నారన్నారు. ఆ కళాశాల ప్రిన్సిపాల్‌ చంద్రమౌళి మాట్లాడుతూ విద్యార్థుల్లో అవయవదానంపై అవగాహనతోపాటు అధ్యాపకులు, విద్యార్థులు అవయవ దానానికి ముందుకు వచ్చేలా తమవంతు కృషిచేస్తామన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర సలహాదారులు ఆడెపు రాజేంద్రప్రసాద్‌, ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి గాదె వెంకట్రామయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైస్‌ ప్రిన్సిపాల్‌ జి సుహాసిని, పరీక్షల నియంత్రణాధికారి రామకృష్ణారెడ్డి, అకడమిక్‌ కోఆర్డినేటర్‌ పార్వతి, కామర్స్‌ విభాగం అధిపతి డీటీ చారి, అధ్యాపకులు కల్పన, రేణుక, శిరీష, సురేష్‌బాబు, మాధవి, స్నేహలత, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాగరాజు

వివరాలు అందజేయాలి

కేయూ క్యాంపస్‌: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో పనిచేస్తున్న లంప్సమ్‌, క్యాజువల్‌ ఉద్యోగులు తమ వివరాలను ఈనెల 26న సాయంత్రం 4గంటల వరకు క్యాంపస్‌లోని నాన్‌టీచింగ్‌ విభాగంలో అందజేయాలని రిజిస్ట్రార్‌ మల్లారెడ్డి ఆదివారం ఆదేశాలు జారీచేశారు. జీఓ ప్రకారం ఆయా ఉద్యోగులు వివిధ ప్రయోజనాలు పొందాలంటే తప్పనిసరిగా తమ వివరాలను అందజేయాలన్నారు.

వేతనాల పెంపుదల అమలు కోసం నిరీక్షణ!

పెంచిన వేతనాల అమలు కోసం ఆయా ఉద్యోగులు కొంతకాలంగా నిరీక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో జీఓ60 ప్రకారం ఆయా ఉద్యోగులను ఔట్‌సోర్సింగ్‌ విధానంలోకి మార్చబోతున్నారు. ఇందులో భాగంగా ప్రొఫార్మా ప్రకారం ఆయా ఉద్యోగుల వివరాలు తెలియజేయాలని అధికారులు కోరుతున్నారని సమాచారం. అయితే ఔట్‌సోర్సింగ్‌ విధానంలోకి మార్చితే తమకు ఉద్యోగభద్రత ఉండదని ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. తమకు కాంట్రాక్టు పద్ధతిలోనే వేతనాలు పెంపుదల చేసి దాని అమలుకు సంబంధించి ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతున్నారు.

కేయూలో జాతీయ సదస్సు

కేయూ క్యాంపస్‌: కాకతీయ యూనివర్సిటీలోని తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఈనెల 26, 27 తేదీల్లో ‘కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు ఆచార్యుల సాహిత్య సేవ’ అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించబోతున్నట్లు సదస్సు డైరెక్టర్‌ బన్న ఐలయ్య తెలిపారు. కేయూలోని పరిపాలనభవనంలోని సెనేట్‌హాల్‌లోనిర్వహించే ఈ ప్రారంభ సమావేశానికి ముఖ్యఅతిథిగా వీసీ రమేష్‌, విశిష్ట అతిథిగా మాజీ వీసీ గోపాల్‌రెడ్డి, ఆత్మీయ అతిథిగా తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వీసీ భూమయ్య హాజరై ప్రసంగిస్తారు. ఈ సదస్సును కేయూ తెలుగు విభాగం విశ్రాంత ఆచార్యులు కోవెలసుప్రసన్నాచార్య ప్రారంభిస్తారు. విశ్రాంత ఆచార్యులు కాత్యాయనీవిద్మహే కీలకపోన్యాసం చేస్తారు.

సమాజ నిర్మాణానికి పాటుపడాలి


పట్టాలు అందుకున్న వైద్య విద్యార్థులతో ముఖ్యఅతిథి,తదితరులు

హన్మకొండ: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి వైద్యులు పాటుపడాలని బోర్డు ఆఫ్‌ ఇండియన్‌ మెడిసిన్‌ ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాస్‌ అన్నారు. వరంగల్‌ లేబర్‌కాలనీలోని అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలకు సంబంధించి ‘జీవితాభినర’ పేరిట గ్రాడ్యుయేషన్‌ డే వేడుకలు ఆదివారం హనుమకొండలోని అంబేద్కర్‌నగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా 2017–2023 బ్యాచ్‌ వైద్య విద్యార్థులకు పట్టాలు పంపిణీ చేశారు. శ్రీనివాస్‌ మాట్లాడుతూ వైద్యులుగా మెరుగైన సేవలు అందించడమే కాకుండా ఆయుర్వేద వైద్యాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్‌ అశోక్‌, సూపరింటెండెంట్‌ జగన్‌మోహనాచారి, స్టూడెంట్‌ అడ్వయిజర్‌ జ్ఞానేశ్వర్‌, నిర్వాహకులు రజనీకాంత్‌, రాజేష్‌, నివేదిక, హిమజ పాల్గొన్నారు.

త్రిచక్రవాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- అనంతరం డివైడర్‌పైకి దూసుకెళ్లిన వాహనం


డివైడర్‌పైకి దూసుకెళ్లిన బస్సు

దామెర: త్రిచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొనగా వాహనదారుడికి తీవ్రగాయాలైన ఘటన హనుమకొండ జిల్లా దామెర మండలంలోని ఊరుగొండ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండకు చెందిన దివ్యాంగుడు అచ్చునూరి ఐలయ్య తన త్రిచక్రవాహనంపై హనుమకొండ నుంచి గూడెప్పాడ్‌కు వెళ్తున్నాడు. అదేసమయంలో భూపాలపల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హనుమకొండ నుంచి భూపాలపల్లికి వెళ్తుంది. ఈ క్రమంలో హైదరాబాద్‌–భూపాలపట్నం జాతీయరహదారిపై ఊరుగొండ సమీపంలోని పెట్రోల్‌పంప్‌ వద్దకు రాగానే త్రిచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొంది. అనంతరం బస్సు అదుపుతప్పి డివైడర్‌పైకి సుమారు 100 మీటర్లు దూసుకెళ్లింది. దీంతో బస్సులోని ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. కాగా, ప్రమాదంలో గాయపడిన ఐలయ్యను 108లో చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు, ఆర్టీసీ అధికారులు పరిశీలించి వివరాలు సేకరించారు. ఆర్టీసీ డ్రైవర్‌ నిద్రలేమి కారణంగానే ప్రమాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. మేడారం జాతరలో విధులు ముగించుకున్న పోలీసులను శనివారం రాత్రి హైదరాబాద్‌కు తీసుకెళ్లి, వెంటనే తిరిగి వస్తున్న క్రమంలో ప్రమాదం జరిగింది. విరామం లేకుండా బస్సు నడపడం మూలంగా ప్రమాదం జరిగిందని చెబుతున్నారు.

నీటి టబ్‌లో పడి యువకుడి మృతి

మొగుళ్లపల్లి: నీటి టబ్‌లో పడి ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని బద్దంపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సామాల వనమాలకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానంకాగా.. భర్త మృతి చెందాడు. ఈక్రమంలో కుమారుడు ప్రశాంత్‌ (25) కండరాల బలహీనత కారణంగా కాళ్లు, చేతులు సరిగా పనిచేయకపోవడం వల్ల సరిగా నడవలేడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ఇంటి దగ్గర ఉన్న నీటి కోసం టబ్‌ దగ్గరకు వెళ్లి అందులో పడి మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి తల్లి సామాల వనమాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మాధవ్‌ గౌడ్‌ తెలిపారు.


ప్రశాంత్‌ మృతదేహం

మృతదేహాన్ని వెలికి తీసిన పోలీసులు

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మేడారం జంపన్న వాగులో గల్లంతైన యువకుడి మృతదేహాన్ని పోలీసులు ఆదివారం వెలికి తీశారు. హైదరాబాద్‌కు చెందిన రోహిత్‌లాల్‌(21) స్నేహితులతో కలిసి మేడారం జాతరకు వచ్చాడు. చిలకలగుట్ట వెనుక ఉన్న దయ్యాల మడుగులో ఈతకొడుతూ గల్లంతయ్యాడు. సమాచారం తెలుసుకున్న ఎస్బీ ఇన్‌స్పెక్టర్‌ కిరణ్‌, సీసీఎస్‌ సీఐ శ్రీనివాస్‌ జంపన్న వాగులోకి స్వయంగా దిగి రెండున్నర గంటల పాటు శ్రమించి మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం ములుగు ఆస్పత్రికి తరలించారు.


మృతదేహాన్ని మోసుకొస్తున్న సీఐలు కిరణ్‌, శ్రీనివాస్‌

తప్పుడు కేసులు, థర్డ్‌ డిగ్రీ

- ఇదేనా ఇందిరమ్మ రాజ్యం..?
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

హన్మకొండ: తప్పుడు కేసులు పెట్టి, ఎత్తుకెళ్లి థర్డ్‌ డిగ్రీ ప్రయోగించడమే ఇందిరమ్మ రాజ్యమా అని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ ఘనపూర్‌ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రశ్నించారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్‌ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రశ్నించే వారిపై కాంగ్రెస్‌ ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేస్తున్నదని, అదే తమ పాలనలో ఫ్రెండ్లీ పోలీసింగ్‌ ఉండేదన్నారు. ఈనెల 23న వరంగల్‌ జిల్లా అగ్రంపహాడ్‌ జాతరకు పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి వెళ్లగా.. అప్పటికే ప్రధాన ద్వారం గేట్‌కు తాళం వేసి ఉండడంతో బీఆర్‌ఎస్‌ నాయకులు, కార్యకర్తలు జై చల్లా.. జై తెలంగాణ అంటూ నినాదాలు చేయగా అధికారులు వచ్చి తాళం తీశారని చెప్పారు. అప్పటికే అధిక సంఖ్యలో వేచి ఉన్న భక్తులు ఒక్కసారిగా తోసుకు రావడంతో ఒక మహిళ కింద పడిందని, ఇక్కడ ఎలాంటి గొడవ జరగలేదన్నారు. అయితే విధులకు ఆటంకం కలిగించడంతోపాటు నెట్టి వేశారంటూ ఈనెల 24న ఒక కానిస్టేబుల్‌తో పిటిషన్‌ తీసుకుని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారని చెప్పారు. ఆదివారం తెల్లవారు జామున బీఆర్‌ఎస్‌కు చెందిన 12 మంది నాయకులు, కార్యకర్తలను ఇళ్ల నుంచి పరకాల ఏసీపీ, ఆత్మకూర్‌ సీఐ, ఎస్సై హనుమకొండలోని టాస్క్‌ఫోర్సు కార్యాలయానికి తీసుకెళ్లి థర్డ్‌ డిగ్రీ ప్రయోగించడమే కాకుండా ఆత్మకూర్‌ ఎస్సై పలుమార్లు చితక బాదారని వివరించారు. ఈ విషయాన్ని చల్లా ధర్మారెడ్డితో కలిసి వెళ్లి వరంగల్‌ పోలీసు కమిషనర్‌కు వివరించగా.. పోలీసులు కొట్టరని, చట్టం ప్రకారం కేసు నమోదు చేసి అరెస్టు చేస్తారని చెప్పినట్లు తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారిని స్టేషన్‌బెయిల్‌పై వదిలి పెట్టిన తర్వాత చూడగా తీవ్ర గాయాలు కనిపించగా మళ్లీ సీపీని కలిసి వివరించగా 24 గంటల్లో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఇందుకు బాధ్యుడైన ఆత్మకూర్‌ ఎస్సైని సస్పెండ్‌ చేయడంతోపాటు ఏసీపీపై చర్య తీసుకోవాలని, లేని పక్షంలో ఈ నెల 27న ‘చలో ఆత్మకూర్‌’ కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తల ఒంటిపై ఉన్న దెబ్బలను విలేకరులతో చూపించారు. బీఆర్‌ఎస్‌ వరంగల్‌ జిల్లా అధ్యక్షుడు ఆరూరి రమేష్‌, నాయకులు ఎల్లావుల లలితా యాదవ్‌, సంజీవ రెడ్డి, బాధితులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కడియం శ్రీహరి

బీట్‌ ఆఫీసర్‌పై దాడిని ఖండిస్తున్నాం

- చర్యలు తీసుకోకుంటే విధులను బహిష్కరిస్తాం
- డీఎఫ్‌ఓకు అటవీ అధికారుల సంఘం ఫిర్యాదు

ములుగు/ములుగురూరల్‌/ఏటూరునాగారం: మేడారం మహాజాతరలో బీట్‌ ఆఫీసర్‌ శ్రీనివాస్‌పై ఆదిలాబాద్‌ ఎస్పీ గౌష్‌ఆలం దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు జూనియర్‌ అటవీ అధికారుల సంఘం నాయకులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ములుగు డీఎఫ్‌ఓ రాహుల్‌ కిషన్‌ జాదవ్‌కు ఆదివారం ములుగు, ఏటూరునాగారం సంఘం నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీనివాస్‌ తన భార్యతో కలిసి సమ్మక్క, సారలమ్మను దర్శించుకుని విధులకు హాజరుకావడానికి పోలీసుల అనుమతి తీసుకుని వెళ్తున్న క్రమంలో ఎస్పీ దాడిచేశారని తెలిపారు. అదే విధంగా అటవీశాఖ ప్రొటోకాల్‌ వాహనాన్ని అడ్డగించి కొంతమేర ధ్వంసం చేసినట్లు వివరించారు. ఈ విషయంపై ఉన్నతాధికారులతో పాటు మంత్రికి కూడా ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు. సదరు అధికారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో న్యాయం జరిగే వరకు విధులకు బహిష్కరించనున్నట్లు స్పష్టం చేశారు. అలాగే.. ఏటూరునాగారంలోని అటవీశాఖ కార్యాలయంలో యూనియన్‌ నాయకులు సమావేశమై బీట్‌ ఆఫీసర్‌ శ్రీనివాస్‌పై ఎస్పీ దాడి చేయడం సరికాదంటూ నిరసన తెలిపారు. డీఎఫ్‌ఓకు ఫిర్యాదు చేసిన వారిలో సాంబు, నరేందర్‌, శ్రీనివాస్‌, కోటేశ్వర్‌, రాజేష్‌, శ్యామ్‌, సుందర్‌, లలితకుమారి, దీప్‌లాల్‌, రూప్‌సింగ్‌, రంజిత్‌, శేషకుమార్‌, రాంప్రసాద్‌, రమేష్‌ ఉన్నారు.


డీఎఫ్‌ఓకు ఫిర్యాదు అందజేస్తున్న అటవీ అధికారులు

నల్లగొండ ఎన్జీ కాలేజీలో ఆదివారం జరిగిన సెపక్‌తక్రా రాష్ట్ర స్థాయి పోటీల్లో మూడో స్థానం పొందిన వరంగల్‌ జూనియర్‌ బాలికల జట్టు క్రీడాకారులు

